క్లుప్తంగా

జగనన్నను కలిసిన బలసాని



గుంటూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు సమస్యలను, ప్రస్తుత రాజకీయ పరిణామాలను గురించి మాట్లాడారు.

ఆకట్టుకున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న మలినేని పెరుమల్లు ఫార్మసీ కాలేజీలో గురువారం రెండు రోజుల టెక్నో కల్చరల్ అండ్ స్పోర్ట్స్ ఫెస్ట్ మొదలైంది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్‌అహ్మద్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఫార్మసీ విద్య అనేది ఒక ఆచరణాత్మక పరిజ్ఞానం కలిగిన విభాగమని తెలిపారు. ఇది దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాను ఒక ఫార్మసీకి సంబంధించి స్టార్టప్ కంపెనీని త్వరలో ప్రారంభిస్తానని తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమల్లు మాట్లాడుతూ.. కరోనా వంటి కష్టకాలంలో ఫార్మసిస్టులు ముఖ్యపాత్రను పోషించినట్లు గుర్తుచేశారు. ఫార్మసీ రంగం 8 నుంచి 18 శాతానికి పెరిగినట్లు వివరించారు. ఫెస్ట్‌కు సంబంధించిన తన అభిప్రాయాలు, సూచనలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసరావు, అకాడమీ డాక్టర్ జైకిషోర్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సుధాకరరావు, డాక్టర్ జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



పొన్నూరు: మండలంలోని కట్టెంపూడిలోని శ్రీ నాగేంద్ర స్వామి దేవస్థానం (పుట్ట)లో మూడు నెలలకు సంబంధించిన హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. గోపి పాల్గొన్నారు. లెక్కింపులో రూ 1.08 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి నిడమానూరు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది నందూరి జయదేవ్, శివ పర్యవేక్షించారు.

వెంకటకృష్ణాపురంలో ఏకగ్రీవంగా ఉప సర్పంచి ఎన్నిక

పెదకాకాని: మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన తాడిబోయిన ఏడుకొండలు ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామంలో గ్రామ సర్పంచి ధూళిపాళ్ళ వెంకటేశ్వరరావు, పది మంది వార్డు సభ్యులతో కూడిన పంచాయితీ బోర్డు కొనసాగుతోంది. ఇప్పటి వరకూ ఉప సర్పంచిగా పనిచేసిన తాడిబోయిన అరుణకుమారి రాజీనామా చేయడంతో ఆ పదవికి గురువారం ఉప సర్పంచి ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ ఎంపిక కార్యక్రమంలో మెజారిటీ వార్డు సభ్యులు తాడిబోయిన ఏడుకొండలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పర్యవేక్షణాధికారి, మండల ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే నల్లమేకల రమణకుమారి (25) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుంది. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో ఆమె పెదనాన్న అంగలూరి సుబ్రహ్మణ్యం ఆమెను పెంచి పెద్ద చేశారు. తిరుపతి జిల్లా ఓజిలి మండలానికి తెల్లమేకల ప్రశాంత్‌తో 2024లో వివాహం చేశారు. గుంటూరులోని పెదనాన్న నివాసంలో ఎలుకల మందు తినగా, బంధువులు చూసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

మిర్చి వ్యాపారి ఆత్మహత్య

పట్నంబజారు: విక్రయించిన మిర్చికి సంబంధించిన డబ్బులు రాలేదన్న మనస్తాపంతో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌లో నివాసం ఉండే జడా నాగరాజు (40) మిర్చి వ్యాపారం చేస్తుంటాడు. కొద్దికాలం క్రితం కర్నూలు జిల్లాకు సంబంధించిన వ్యాపారులకు 610 బ్యాగుల మిర్చి పంపాడు. దానికి సంబంధించి సుమారు రూ. 27 లక్షలకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. సదరు కర్నూలు వ్యాపారులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన నాగరాజు ఈ నెల 26న గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సర్వేలతో సరి!

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేల కారణంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సతమతం అవుతున్నారు. అధికారులు ఇచ్చే టార్గెట్ల ఒత్తిడితో ఆందోళన చెందుతున్నారు. అనారోగ్యంగా ఉన్నా సెలవు దొరకని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చేస్తున్న సర్వేలతో కింది స్థాయి సిబ్బందికి పనిభారం పెరిగింది. దీంతో ఏం చేయాలో తెలియక దయనీయ స్థితిలో ఉద్యోగులు కాలం వెళ్లదీస్తున్నారు.

- లక్ష్యాలతో పెరిగిన పనిభారం
- తీవ్ర ఒత్తిడిలో ప్రభుత్వ ఉద్యోగులు



కట్టెంపూడిలో పీ 4 సర్వే చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ (ఫైల్)

పొన్నూరు: ప్రతి రోజూ సర్వేలకే సమయం సరిపోవడంతో పెండింగ్ పనులు చేయలేక పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. మండల అధికారుల మాట కాదనలేక నలిగిపోతున్నారు. ప్రస్తుతం మండలంలోని 29 గ్రామాల్లో పీ4 సర్వే, వర్క్ ఫ్రం హోమ్ సర్వే, ఎంఎస్ఎంఈవో సర్వే, హౌస్‌హోల్డ్ జియోట్యాగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, పీజీఆర్ఎస్, ఈకేవైసీ, డెత్ రీవెరిఫికేషన్, ఆధార్ మిస్సింగ్ వంటి సర్వేలు ఉద్యోగులు చేస్తున్నారు. దీంతో పాటు ఆయా సర్వేలు ఫలానా సమయంలోగా పూర్తి చేయాలన్న ఆదేశాలతో ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు గ్రామ సభలు, ఇంటి పన్నుల వసూలు, పింఛన్ల పంపిణీల వంటి కార్యక్రమాలు కూడా భారంగా మారాయి. ఒకేసారి ఇన్ని సర్వేలు చేయడంతో అనారోగ్యానికి గురవుతున్నామని పలువురు కార్యదర్శులు వాపోతున్నారు.

గతంలో వలంటీర్ వ్యవస్థతో మేలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చింది. వారి ఐదేళ్ల కాలంలో ఎక్కడా ఎటువంటి లోపం జరగకుండా చూశారు. నవశకం వంటి ఒకే సర్వేతో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరువ చేశారు. అప్పట్లో ప్రతి 50 ఇళ్లకు కేటాయించబడిన వలంటీరే ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేసేవారు. దీంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పడేది కాదు. కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టడంతో ఉద్యోగులకు కష్టాలు ఎదురయ్యాయి. వలంటీర్లే ఉంటే ఉద్యోగులపై సర్వేల భారం పడేది కాదేమో అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తమపై ఉన్న పని భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సకాలంలో సర్వేలు పూర్తి చేయాలి



పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో చేస్తున్న సర్వేలను సకాలంలో పూర్తిచేయాలి. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అన్ని సర్వేలు పూర్తి చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.

– గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీఓ, పొన్నూరు

కూటమి కుట్రలను ఛేదించిన శ్రేణులు

– మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి

గుంటూరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలతో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పరిపాలన సాగిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. గురువారం గుంటూరు రూరల్ మండలం వైస్ ఎంపీపీగా వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ కాకాని రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అంబటిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్‌ను అభినందించి, ఘనంగా సన్మానించారు. అంబటి మాట్లాడుతూ రూరల్ మండలంలో కూటమి ప్రభుత్వం ఎంపీటీసీలను పోలీసులతో బెదిరించి, కిడ్నాప్‌లకు ప్రయత్నించినా అకుంఠిత దీక్షతో రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నిల్లో విజయకేతనం ఎగురవేయటం అభినందనీయం అన్నారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు చెంపపెట్టు అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కుట్రలకు తెరతీసిన కూటమి ప్రభుత్వానికి ఇది సిగ్గుచేటన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై తిరగబడుతున్నారని ఈ ఎన్నికల్లో తేటతెల్లమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి కుదేలవ్వటం ఖాయమన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండల వైఎస్సార్‌సీపీ నేతలను, ఎంపీటీసీలను, ప్రజా ప్రతినిధులను, కార్యకర్తలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో కూటమికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మీడియాపై దాడులను అరికట్టాలి

చేబ్రోలు: మీడియా రంగంపై జరుగుతున్న దాడులపై కఠిన చర్యలు తీసుకోవాలని చేబ్రోలు మండల ప్రెస్ క్లబ్ సభ్యులు గురువారం తహసీల్దారును కోరారు. చేబ్రోలుకు చెందిన ఒక దినపత్రిక విలేకరిపై దాడులకు ప్రయత్నించటాన్ని నిరసిస్తూ స్థానిక తహసీల్దారు కె.శ్రీనివాసశర్మకు వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతికా స్వేచ్ఛను హరించేలా ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ సంఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తహసీల్దారు తెలిపారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో కూడా పోలీసులకు ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రెస్ క్లబ్ సభ్యులు రెడ్డి గంగాధరరావు, సీహెచ్‌వీ సురేష్ బాబు, జి. ప్రసాదరావు, ఎస్.నాగరాజు, రాజశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్ల నిర్వహణకు వేలం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మరుగుదొడ్లు, మార్కెట్లు, సైకిల్ స్టాండ్‌లకు సంబంధించి మార్చి 31వ తేదీ వరకు లీజు నిర్వహించుకోవడానికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం వివరాలను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు.. డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించారు. నగరపాలక సంస్థకు చెందిన 14 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం చేపట్టారు. 13 ప్రాంతాల్లో టెండర్ దాఖలు చేశారని, పాల ఆసుపత్రి వద్ద మరుగుదొడ్లకు ఎవరూ పాల్గొనలేదన్నారు. టెండర్‌లో పాల్గొని, అధిక బిడ్ దాఖలు చేసిన వాటిని ఆమోదం కోసం కమిషనర్‌కి, స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రెహ్మాన్, రవి కిరణ్ రెడ్డి, సాదిక్ బాషా, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

53 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వీ శ్రీదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన మెగా జాబ్ మేళాకు నాలుగు కంపెనీలు హాజరయ్యాయి. అక్రో సాఫ్ట్ సొల్యూషన్స్, జెడ్ ఎం క్యూర్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఇన్నోవేసోర్స్ కంపెనీల ప్రతినిధులు వచ్చారు. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్హత కలిగిన ఆసక్తి కలిగిన యువతీయువకులు 196 మంది హాజరయ్యారు. వీరిలో 53 మందిని కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.ఈశ్వరరావు, స్కిల్ హబ్ స్పాక్ హనుమంతరావు, కో ఆర్డినేటర్ రాంచందు పాల్గొన్నారు.

జీవీఆర్‌ఎస్‌లో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు రూరల్: నగర శివారు బుడంపాడు గ్రామంలోని జీవీఆర్ అండ్ ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యూషన్ ఫిస్టా- 2025 టెక్నికల్ ఫెస్ట్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ స్టూడెంట్స్ నూతన ఆవిష్కరణతో ముందుకు సాగాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక విద్యను నేర్చుకోవాలని తెలిపారు. విద్యార్థి దశలో చదువుతోపాటు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఎంచుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ షేక్ కరిముూన్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన సృజనాత్మకతను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పీపీటీ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి భాస్కర్‌నాయుడు, డీన్ డాక్టర్ బి.వరప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ సీహెచ్ పాపారావు, యుగంధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి బలసాని అభినందనలు



కాకాని రమేష్‌ను సన్మానిస్తున్న బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం బెదిరింపులు, కుట్రలు పన్నిన కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కొని రూరల్ మండలం వైస్ ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ నేతలకు నియోజకవర్గం ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ అభినందనలు తెలిపారు. గురువారం వైస్ ఎంపీపీగా ఎన్నికైన కాకాని రమేష్, ఎంపీపీ ఇంటూరి పద్మావతి, వైస్ ఎంపీపీ దర్శి సుజాతలు బలసానికి ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ కూటమి కుట్రలను చిత్తుచేసి ప్రజా సంక్షేమానికే ప్రజలు పట్టకడతారని రూరల్ మండలం వైస్ ఎంపీపీ ఎన్నిక నిరూపించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మండలాభివృద్ధికి కృషిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముందుండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి నిరసనగా శాంతి ర్యాలీ

చేబ్రోలు: తూర్పు గోదావరి జిల్లాలో అనుమానాస్పద స్థితిలో పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ జరిపి న్యాయం చేయాలని గురువారం చేబ్రోలు మండలంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులు, దైవజనులు, మందిరాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ మండల పరిధిలోని నారాకోడూరు నుంచి చేబ్రోలు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలి, దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి వంటి నినాదాలతో ప్లకార్డులు, బ్యానర్లతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కే శ్రీనివాసశర్మకు, చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో వినతిపత్రాలను అందజేశారు. పాస్టర్ మార్క్, మోషీ, పాలు, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో బహిరంగ వేలం



పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో 2025–26, 2026–27 ఆర్థిక సంవత్సరములకు సంబంధించి ఇ–టెండరు, సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలంపాటలు గురువారం కల్యాణ మండపంలో నిర్వహించారు. దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారిగా పెదకాకాని గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు హాజరయ్యారు. 11 లైసెన్సు హక్కులు, కొబ్బరికాయల కొట్టు, కూల్‌డ్రింక్స్, పాదరక్షలు భద్రపరచుకొనుట తదితర 8 లైసెన్సు హక్కులకు వేలంపాటలు పూర్తి అయ్యాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. వాయిదా పడిన తలనీలాలు ప్రోగు చేసుకొనుట, బొమ్మల షాపు, ఫొటోలు, వీడియో తీసుకొను లైసెన్సు హక్కులకు త్వరలో ఇ–టెండరు, సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలం నిర్వహించే తేదీని ప్రకటించడం జరుగుతుందన్నారు. ఈ వేలంపాటల ద్వారా స్వామివారికి గత వేలం పాటల కన్నా అధిక ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత

నగరంపాలెం: ఇటీవల వేర్వేరుగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.చంద్రశేఖరరావు, కానిస్టేబుల్ షేక్ ఇమ్రాన్‌వలి మరణించారు. ఈ మేరకు చేయూత పథకం కింద చంద్రశేఖరరావు భార్య జ్యోతి, ఇమ్రాన్‌వలి భార్య మైమూనలకు రూ.లక్ష చొప్పున చెక్కులను గురువారం ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బాజీ సాహెబ్



ఎన్నికల అధికారి నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న బాజీ సాహెబ్

పొన్నూరు: పొన్నూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ప్రముఖ న్యాయవాది షేక్ బాజీ సాహెబ్ ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పిల్లి విజయ్‌కుమార్ వ్యవహరించారు. బాజీ సాహెబ్, తూమాటి రమేష్ పోటీలో నిలిచారు. మొత్తం 57 ఓట్లు ఉండగా వాటిలో 52 పోలయ్యాయి. బాజీ సాహెబ్‌కు 33, రమేష్‌కు 18 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదు. అనంతరం ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బాజీ సాహెబ్‌కు ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేసి, అభినందించారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పులివర్తి వసంతబాబు, ప్రధాన కార్యదర్శిగా పొందుగల చైతన్య, సంయుక్త కార్యదర్శిగా ఎంహెచ్‌ఎస్ సాయిబాబు, కోశాధికారిగా నామా విద్యాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పొందుగల జయరాజ్, మల్లెల ఈరేష్, చిల్లర నాగరాజు, మగ్బుల్ బేగ్, సదానందరావు, డి. కోటేశ్వరరావు, విఠల్ ప్రసాద్, న్యాయవాద గుమస్తాలు పులిపాక రామారావు, సుబ్బారావు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడేందుకు తమ కళాశాల ముందుంటుందని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం . ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 2025 విద్యా సంవత్సరంలో కళాశాలలో చదువుతున్న 110 మంది ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రముఖ కోర్, సాఫ్ట్‌వేర్ కంపెనీలైన ఇన్ఫోసిస్, జెడ్ ఎఫ్ గ్రూప్స్, టీవీఎస్ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చాయన్నారు. వార్షిక వేతనం రూ 3 లక్షలని చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, విభాగాధిపతులు డాక్టర్ ఎం సూర్యనారాయణ, డాక్టర్ బి. శ్రీకాంత్, ప్రొఫెసర్ రాజు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ బి.బిందుమాధవి, డాక్టర్ ఎం. వెంకట్రావు తదితరులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఏ ఖదర్



విద్యుత్ కాంతులలో ఓ మసీదు



కాంతులీనుతున్న జామియా మసీదు

పొన్నూరు: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో మహోన్నతంగా భావించే షబ్ ఏ ఖదర్ (లైలతుల్ ఖదర్) జాగారం రాత్రిని ముస్లింలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పొన్నూరులోని మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రంతా జాగరం చేస్తూ ప్రత్యేక నమాజులు చేసి ఖురాన్ పఠించి, తజ్బీతో అల్లాను స్మరించారు. మహిళలు ఇళ్లలో ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ శుభరాత్రి రోజునే పవిత్ర గ్రంథం ఖురాన్ భూమిపై అవతరించిందని విశ్వసిస్తారు. శుక్రవారం తెల్లవారుజాము వరకు జాగారం చేసి మళ్లీ సహరీ చేసి ఉపవాస దీక్ష కొనసాగించారు. పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని తదితర ప్రాంతాల్లోని స్థితిమంతులు, సేవా సంస్థల ప్రతినిధులు ఇప్పటికే పేదలకు రంజాన్ తోఫా రూపంలో పేద ముస్లింలకు నిత్యావసరాలు, దుస్తులు, సామగ్రి, నగదు వంటివి అందజేస్తున్నారు. సంపాదనలో వందకు రూ.2.50 చొప్పున జకాత్, రూ.100 చొప్పున ఫిత్రా పేదలకు ఇస్తున్నారు. ప్రతి ఇంటిలో ఎంత మంది ఉన్నా ఒక్కొక్కరి పేరిట రూ. 100 పేదలకు అందిస్తున్నారు. మసీదు కమిటీ నిర్వాహకులు, మత పెద్దల సహకారంతో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి.



రంజాన్ శుభాకాంక్షలతో ఏర్పాటైన స్టార్

ఈకేవైసీ కోసం కార్డుదారుల అవస్థలు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం పేద వర్గాల వారికి ఇచ్చే రేషన్‌కు గండి కొట్టేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈకేవైసీ పెండింగ్ పేరుతో రేషన్ కార్డుదారులను దుకాణాల వద్దకు పిలిపిస్తున్నారు. ఒక వేళ ఈకేవైసీ ఈ నెలాఖరులోపు చేయించుకోకపోతే వారికి సరకులు నిలిపివేస్తామని స్పష్టంగా చెప్పడంతో దిక్కుతోచక దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గుంటూరు జిల్లాలో 5.99లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెల రేషన్ ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారు. ఈ రేషన్‌ను కూడా కట్ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నింది. ఈ నెలాఖరులోపు ఇంటిలో ఎంత మంది ఉన్నారో వారంతా రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని.. లేకపోతే సరకులు రావని సిబ్బంది చెప్పడంతో పలువురు పడిగాపులు కాస్తున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవల పరంగా ఎలాంటి ఇబ్బందులు లబ్ధిదారులు పడకూడదనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సదరు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఈకేవైసీ సచివాలయంలో కాకుండా రేషన్ షాపుల వద్దకు వెళ్లి చేయించుకోవాలని కూటమి పాలకులు చెబుతున్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



మహిళకు తోఫా అందిస్తున్న దృశ్యం

పొన్నూరు: రంజాన్‌ను పురస్కరించుకుని పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పఠాన్ ఫైరోజ్ ఖాన్, మాదాల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబురావు, ఎండీ గౌస్, ఎండీ రహంతుల్లా, షేక్ సిలార్ బాషా, షేక్ బాబ్జి, షేక్ బజ్జి, టి.లక్ష్మీనారాయణ చౌదరి, షేక్ కరిముల్లా బాజి, పిన్నమనేని కోటేశ్వరరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.